తెలంగాణ,
ఆంధ్రప్రదేశ్
ఆది వారం
08 జనవరి, 2023
సంపుటి - 07,
సంచిక-230
పేజీలు - 4
వెల రూ. 5/-

www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : గోసుకొండ పృద్విరాజు | Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Vishakapatnam, Vijayawada, Ongole

# కామారెడ్డిలో ఇంకా చల్లారని ఉద్రిక్తతలు

## ఇండస్ట్రియల్ జోన్‌కు భూములు ఇవ్వమని స్పష్టం



### మాస్టర్ ప్లాన్ వ్యతిరేకిస్తూ హైకోర్టులో కేసులు

**కామారెడ్డి, జనవరి 7 (సమ సమాజం):** కామారెడ్డిలో ఇంకా ఉద్రిక్తతలు చల్లారలేదు. రైతుల ఆందోళనలు ఆగడం లేదు. తమ భూములకు ఎసరు వచ్చిందన్న ఆందోళనలో వారు ఉన్నారు. వరుసగా మూడోరోజూ ఆందోళన సాగుతోంది. దీనికితోడు బహత్‌ప్రణాళికపై రైతులు హైకోర్టు గడపదొక్కారు. ఇండస్ట్రియల్ జోన్‌కు భూములు ఇచ్చేది లేదని రైతులు తేల్చి చెప్పారు. ఈ మేరకు 40మంది రైతులు కోర్టులో కేసు వేశారు. మాస్టర్ ప్లాన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే చనిపోయిన రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్‌ఆనరు. రైతులపై దాడికి నిరసనగా కలెక్టరేట్ దగ్గర రైతుల ఆందోళన చేపట్టారు. అడ్లూర్ ఎల్లారెడ్డిలో టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి పర్యటనపై ఉత్కంఠ కొనసాగుతోంది. నిన్న బండి సంజయ్ పర్యటన ఉద్రిక్తతతో రేవంత్ రెడ్డి పర్యటన డైలమాలో ఉంది. మరోవైపు జిల్లా కలెక్టర్ తీరుపై రైతులు ఆగ్రహంతో ఉన్నారు. ఇప్పటి వరకు రైతులను కలెక్టర్ కలవలేదు. కామారెడ్డి మాస్టర్ ప్లాన్ కారణంగా తనకు నష్టం జరుగుతుందన్న ఆందోళనతో సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డికి చెందిన రైతు రాములు ఇటీవల ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. రాములు కుటుంబాన్ని బండి సంజయ్ శుక్రవారం పరామర్శించారు. మాస్టర్ ప్లాన్‌కు వ్యతిరేకంగా రైతులు చేపట్టిన ఆందోళనకు మద్దతు తెలిపారు. అనంతరం రైతులు, బీజేపీ 3వ

### కామారెడ్డి మాస్టర్ ప్లాన్‌పై అపోహలు వీడండి



- అపోహలతో ఆందోళనలకు దిగడం సరికాదు
- ప్రస్తుతం ఇది ముసాయిదా మాత్రమే
- రైతుల భూములు ఎక్కడికీ పోవు
- అభ్యంతరాలను నమోదు చేసుకుంటాం
- మీడియా ముందు వివరణ ఇచ్చిన కలెక్టర్ జితేశ్వ్ పాటిల్

**కామారెడ్డి, జనవరి 7 (సమ సమాజం):** కామారెడ్డి నూతన మాస్టర్ ప్లాన్‌పై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అది కేవలం ముసాయిదా మాత్రమేనని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ వివరణ ఇచ్చారు. దీనిపై రైతులు అనవసర అపోహలకు గురవుతున్నారని అన్నారు. శనివారం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ.. అపోహలు నమ్మి ఆందోళన చెందుతున్నారని... అందరి అభ్యంతరాలు పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. ఎవరి భూములూ నష్టపోరని స్పష్టం చేశారు. ఏదైనా ఇబ్బందులు, అభ్యంతరాలు ఇస్తే రికార్డు చేస్తామని... అందరికీ సమాధానాలు ఇస్తామని చెప్పారు. ఇది ముసాయిదా మాత్రమే అని... ఫైనల్ 3వ

# కోహెడలో అత్యాధునిక చేపల మార్కెట్



### 50 కోట్లతో నిర్మిస్తామని మంత్రి తలసాని వెల్లడి

**హైదరాబాద్, జనవరి 7 (సమ సమాజం):** నగర శివార్లలోని కోహెడలో రూ.50 కోట్లతో 10 ఎకరాల్లో ఆధునిక సౌకర్యాలతో హోల్‌సేల్ చేపల మార్కెట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు పశు సంవర్ధక, మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ప్రతిపాదిత చేపల మార్కెట్‌తో పాటు హోల్‌సేల్ మార్కెట్, రిటైల్ మార్కెట్, కోల్డ్ స్టోరేజీ, క్యాంటీన్ సౌకర్యాలు కూడా కల్పించనున్నట్లు ప్రకటించారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత మత్స్య రంగం అద్భుతమైన వృద్ధిని నమోదు చేసిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆ రంగానికి తగిన నిధులు కేటాయిస్తూ పెద్దఎత్తున 3వ

# కొత్త మెడికల్ కాలేజీలను త్వరగా పూర్తి చేయాలి

### కేంద్రం పరిశీలనకు వచ్చే లోగా పూర్తి కావాలి

### అధికారులను ఆదేశించిన మంత్రి హరీష్ రావు



**హైదరాబాద్, జనవరి 7 (సమ సమాజం):** రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయబోయే తొమ్మిది మెడికల్ కాలేజీల పనులను వేగవంతం చేయాలని మంత్రి హరీష్ రావు ఉన్నతాధికారులను ఆదేశించారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ బృందం పరిశీలనకు వచ్చేనాటికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తికావాలన్నారు. ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కార్యాలయం నుంచి ఎన్‌హెచ్‌ఎం, టీఎస్‌ఎంఎస్ఐడీసీలపై మంత్రి నెలవారీ సమీక్ష నిర్వహించారు. సీఎం కేసీఆర్ మార్గ నిర్దేశనంలో గతేడాది 8 మెడికల్ కాలేజీలు ఒకేసారి ప్రారంభించి రికార్డు సృష్టించామని, ఇదే స్ఫూర్తితో ఈ 3వ

# నిర్మల్ సబ్‌జైలులో రిమాండ్ ఖైదీ మృతి


### అధికారుల తీరుపై బంధువుల అనుమానం



**నిర్మల్, జనవరి 7 (సమ సమాజం):** నిర్మల్ జిల్లా సబ్ జైల్లో రిమాండ్ ఖైదీ మృతి చెందాడు. అయితే దీనిపై కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కాల్వ సతీష్ (27) అనే రిమాండ్ ఖైదీ అనారోగ్యంతో మరణించాడని పోలీసులు చెబుతున్నారు. లక్ష్మణ్ చాందా మండలం పీచర గ్రామానికి చెందిన సతీష్‌ను ఇటీవలే చేపల వేట విషయంలో పోలీసులు అరెస్ట్ చేసి సబ్ జైలుకు తరలించారు. మృతుడు సతీష్ రెండు రోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతున్నాడని ఆయనను ఆసుపత్రి తరలించే లోగానే మరణించినట్లు సబ్ 3వ

# నగరంలో వరుస చైన్ స్నాచింగ్‌లు

### ఛేజ్‌చేసి వరంగల్‌లో పట్టుకున్న పోలీసులు



**హైదరాబాద్, జనవరి 7 (సమ సమాజం):** హైదరాబాద్ - రాచకొండ పరిధిలో ఆరు చోట్ల చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన చైన్ స్నాచర్లను పోలీసులు పట్టుకున్నారు. వరంగల్ జిల్లా కాజీపేట రైల్వేస్టేషన్‌లో స్నాచర్లను 3వ

# లిక్కర్ స్కామ్ కేసును విచారించిన రౌస్ ఎవెన్యూ కోర్టు

**న్యూఢిల్లీ, జనవరి 7 (సమ సమాజం):** ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఈడీ దాఖలు చేసిన సప్లిమెంటరీ ఛార్జ్ షీట్ పై రౌస్ ఎవెన్యూ కోర్టు విచారణ జరిపింది. 13,657పేజీలతో కూడిన ఛార్జ్ షీటును న్యాయస్థానం పరిశీలించ నుంది. మొదటి ఛార్జ్ షీటులో ఏ1గా సమీర్ మహేంద్రు, ఏ2, ఏ3, ఏ4, ఏ5లుగా సమీర్ మహేంద్రుకు చెందిన కంపెనీలను ఈడీ చేర్చింది. సప్లిమెంటరీ ఛార్జ్ షీటులో ఈడీ ఐదుగురు వ్యక్తులతో పాటు 7 కంపెనీల పేర్లు ప్రస్తావించింది. శరత్ చంద్రారెడ్డి, బినయ్ బాబు, అభిషేక్ బోయినపల్లి, విజయ్ నాయర్,అమిత్ అరోరాలను నిందితులుగా చేర్చింది. లిక్కర్ కేసుకు సంబంధించి ఈడీ ఇప్పటి వరకు ఛార్జ్ షీట్ లో ఆరుగురు వ్యక్తులు, 11 కంపెనీల పేర్లను ప్రస్తావించింది.




# మా మంత్రులకు కళ్లద్దాలు ఇవ్వండి

### వారు సమస్యలను చూడలేకపోతున్నారు

### మంత్రి ఎర్రబెల్లికి బిజెపి ప్రతినిధి రాకేశ్ లేఖ



**హైదరాబాద్, జనవరి 7 (సమ సమాజం):** మంత్రి ఎర్రబెల్లి దయాకర్ కి బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్ రెడ్డి లేఖ రాశారు. తమ నగర ఎమ్మెల్యేలకు కంటివెలుగు కళ్లద్దాలు ఇప్పించండంటూ రాకేష్ రెడ్డి లేఖలో పేర్కొన్నారు. అందరూ కళ్లు సరిచూసుకొని, కళ్లద్దాలు తీసుకోవాలని మంత్రి ఎర్రబెల్లి చేసిన కామెంట్లను రాకేష్ రెడ్డి గుర్తు చేశారు. పనిలో పనిగా మీలాంటి కళ్లద్దాలు తమ వరంగల్ తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, వినయ్ భాస్కర్ కి కూడా చెరో జత ఇప్పించండి మంత్రిగారు... అంటూ ఆయన లేఖలో విజ్ఞప్తి చేశారు. వారికి వరంగల్ ప్రజలు పడుతున్న అవస్థలు ఏ మాత్రం కనిపించడం లేదని ఈ సందర్భంగా రాకేష్ రెడ్డి ఆరోపించారు. పైగా వరంగల్ దశ దిశ మారిందని ప్రచారం చేసుకుంటు న్నారన్నారు. ఎన్నో ఏళ్లుగా మాస్టర్ ప్లాన్ లేక, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ లేక, డంపింగ్ యార్డ్ లేక మురికి వాడల్లో సౌకర్యాలు లేక, డబుల్ బెడ్ రూం ఇల్లు రాక, ఇళ్ళ పట్టాలు రాక, ఇంటి నుంబర్లు రాక, కొత్త రేషన్ కార్డ్ లు రాక, పెన్షన్లు రాక నగర ప్రజలు గోస పడుతున్నారని రాకేష్ రెడ్డి విన్నవించారు. విలీన గ్రామాల ప్రజలు పన్నులు పెరిగి గ్రామాల్లో అభివృద్ధి పనులు తగ్గి ఇబ్బంది పడుతున్నారన్న ఆయన.. వాటితో పాటు మూలన పడ్డ కాళోజీ కళా క్షేత్రం పనులు, పూర్తి కాని టెక్స్టైల్ పార్క్, ఇలా అన్ని 3వ

# ఆలయాల పునరుద్ధరణకు కెసిఆర్ చర్యలు

### అధికారులతో కలసి సోమేశ్వరాలయాన్ని సందర్శించిన మంత్రి

**జనగాం, జనవరి 7 (సమ సమాజం):** తెలంగాణ వార సంపద, కాకతీయుల కళా విశిష్టతను, చారిత్రక ప్రసిద్ధ ఆలయాల పునరుద్ధరణకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. పాలకుర్తి నియోజకవర్గం కేంద్రంలో వెలసిన స్వయంభు శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని జిల్లా కలెక్టర్ శివలింగయ్య, అధికారులు, నిపుణులతో కలిసి సందర్శిం చారు. నియోజకవర్గంలో ఉన్న ఐదు ప్రాచీన ఆలయాల పునరుద్ధరణకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 50 కోట్లతో



3వ

# అమెజాన్‌లో ఉద్యోగుల తొలగింపు

### దేశంలో వేయి మందికి ఉద్వాసన




**న్యూఢిల్లీ, జనవరి 7 (సమ సమాజం):** ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ అమెజాన్ ఈ ఏడాది సుమారు 18 వేల మంది ఉద్యోగులకు ఉద్వాసన పలకనున్నట్లు గురువారం ప్రకటించింది. ఈ తొలగింపు పక్రియలో దాదాపు వెయ్యి మంది భారత ఉద్యోగులపై ప్రభావం పడనున్నట్లు తెలుస్తోంది. అమెజాన్ ఇండియాలో ప్రస్తుతం లక్ష మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. అందులో 1,000 మంది ఉద్యోగాల పోతాయని తెలుస్తోంది. అంటే 1శాతం ఉద్యోగులపై ఈ ప్రభావం ఉండబోతోందని సమాచారం. కాగా, కొవిడ్ సమయంలో చాలామంది ఉద్యోగులను నియమించుకొన్నామని, అనిశ్చిత పరిస్థితుల కారణంగా వారిని తొలగిస్తున్నామని అమెజాన్ సీఈవో ఆండీ జెస్సీ తెలిపారు. 3వ

# సంపాదకీయం

## రైతుల పాలిట రాక్షసులుగా పాలకులు !

కామారెడ్డి ఆందోళన రైతుల ఆక్రందనకు అద్దంపట్టే చర్య. ఇప్పుడు కామారెడ్డి ఒక్కటే కాదు... ఇంతకు ముందు మల్లన్న సాగర్,కొండపోచమ్మ సాగర్...ఫార్మాసిటీ, పోలవరం..అమరావతి, విశాఖ ఉక్కు, గంగవరం పోర్టు... ఇలా చెప్పుకుంటే పోతే అనేక చోట్ల ప్రభుత్వాల దౌర్జన్యం కనిపిస్తుంది. దోపిడీదారులుగా మారిన పాలకులు రైతుల నుంచి బలవంతంగా భూములను గుంజుకుని వ్యాపారం చేస్తున్న తీరు దారుణం కాక మరోటి కాదు. అభివృద్ధి అన్న అందమైన పేరు చూపి భూములను గుంజుకుని బక్కరైతులను బజారున పడేస్తున్న తీరు నిరంకుశ పాలనకు సాక్ష్యంగా చూడాలి. ఎంతగా అంటే వారికి ముష్టి దబ్బులు వేసి భూములను గుంజుకుంటున్న తీరు కళ్లముందు కనబడుతున్నది. రైతులు ఆక్రందనతో ఆందోళన చేస్తుంటే పోలీస్ బలగాలతో వారిని అణచివేస్తున్నారు. ఇళ్లను కూడా గుంజుకుని వారిని తన్ని తరిమేస్తున్న తీరు దౌర్జన్యానికి పరాకాష్టగా చెప్పుకోవాలి. ఎకరా 50 లక్షలు పలుకుతోందని చెబుతున్న వారే ముష్టిగా ఎకరాకు 5 లక్షలు ఇచ్చి గుంజుకుంటున్నారు. నిజానికి పరిహారం ఇచ్చేప్పుడు రైతులకు మళ్లీ బతికేందుకు అవకాశం రావాలి. కానీ అలా జరగడం లేదు. ఊళ్లకు ఊళ్లు లేపేసినా వారి ఏడ్పులు వీరికి వినిపించడం లేదు. గతంలో మల్లన్నసాగర్,కొండపోచమ్మ సాగర్ ముంపు గ్రామాల ప్రజలకు పరిహారం చెల్లింపులో పరిహాసమాడారు. ఆందోలనచేసిన రైతన్నలను చావుదెబ్బలు కొట్టించారు. జైళ్లకు తరలించారు. బేడీలు వేశారు. మల్లన్న సాగర్,కొండపోచమ్మ సాగర్‌ల రైతులు త్యాగాలు చేశారు,.. భూములను వదులుకున్నారు. ఇళ్ళు, ఊళ్లను వదులుకున్నారు. కట్టుబట్టలతో బయటపడ్డ వారికి ముష్టి వేశారు. ప్రాణాలు పోతున్నా తనకేం పట్టనట్లు వ్యవహరించిన తెలంగాణ సిఎం కెసిఆర్ చిద్విలాసంతో బ్రహ్మాండమైన ప్రాజెక్టులు కట్టానిని మురిసిపోయారు. నిజానికి వారికి సరైన పరిహారం చెల్లించి వారిని సంతోషంగా తరలించివుంటే ప్రజలు హర్షించేవారు. ప్రాజెక్టుల కోసం సర్వస్వాన్ని త్యాగం చేస్తున్న ముంపు గ్రామాల ప్రజలకు బతికే హక్కు కూడా లేకుండా చేశారు.ప్రాజెక్టు మంపు ప్రాంతాల ప్రజలకు పరిహారం అందించాలని రాజకీయ నాయకులు డిమాండ్ చేస్తే పరిహాసమాడారు. ఈ క్రమంలో మల్లన్నసాగర్ ప్రాజెక్టు కోర్టు దిక్కరణ కేసులో తెలంగాన హైకోర్టు సంచలన తీర్పు వెల్లడిం చింది. ప్రభుత్వ అధికారులకు జైలు శిక్ష, జరిమానా విధించిం ది. 2018లో మల్లన్న సాగర్ ప్రాజెక్ట్ విషయం లో రైతుల అభ్యంతరాలు వినకుండా అధికారులు డిక్లరేషన్, అవార్డు ఇచ్చారని కొంత మంది రైతులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ డిక్లరేషన్‌ను, అవార్డును రద్దు చేస్తూ హైకోర్టు గతంలోనే ఆదేశించింది. ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను మొత్తం రైతులందరికీ తెలపాలని, అభ్యంతరాలు పరిగణనలోకి తీసుకోని విచారణ జరిపించి, ఆర్డర్ కాపీని ప్రతి రైతుకు ఇవ్వాలని న్యాయస్థానం గతంలోనే ఆదేశించింది. అయితే.. హైకోర్టు ఆదేశాలను పాటించకుండా డిక్లరేషన్, అవార్డు ప్రకటించారని 2019లో రైతులు మరోసారి కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను హైకోర్టు విచారించి అప్పటి సిద్దిపేట కలెక్టర్ వెంకట్రామిరెడ్డి, సిరిసిల్ల కలెక్టర్ కృష్ణ భాస్కర్‌కు రూ. 2000ల జరిమానా విధిం చింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇది గొప్ప విజయమని గమనించాలి. అయితే ప్రభుత్వానికి ఇవేమీ పట్ట లేదు. భూసేకరణలో పరిహారం తీసుకోని 14 మంది మాత్రమే మిగిలారు, వీళ్లు ఏమీ చేయలేరని అనుకు న్నారు. 17000 ఎకరాల భూమి తీసుకున్నాం.. కేవలం 41 ఎకరాల భూమి కోసం వీళ్లు ఏమి చేయగలరని హేళన చేశారు. రైతులను ఏమార్చడానికి ఉద్యమనేత కెసిఆర్ కూడా వెనకాడలేదనడానికి ఓ ఉదాహరణ మాత్రమే. నిజానికి పరిహారం తగినంతగా ఇచ్చివుంటే కెసిఆర్ ప్రజల మన్ననలు పొందివుండే వారు. రైతులు ఎప్పుడు కూడా ఒకరి పొట్ట కొట్టాలని చూడరు. వారి పొట్ట కొట్టాలని చూస్తే మాత్రం తిరగ

బడతారు. సమాధానం ఇస్తారు. దీంతోనైనా మార్పు వచ్చి ప్రతి ఒక నిర్వాసితునికి సంపూర్ణ న్యాయం చేస్తారని ఆశించినా.. తిరిగి అలాంటి దౌర్జన్యాలే కొనసాగిస్తున్నారు. న్యాయం కోసం పోరాడుతున్న మల్లన్నసాగర్ ముంపు బాధితులకు నరకం చూపించారు. ఇల్లు, వాకిలీ, భూమిని స్వాధీనం చేసుకొని, నిలువ నీడలేకుండా చేసి వేధించడం ప్రత్యేక తెలంగాణలో మాత్రమే చూశాం. తెలంగాణ ప్రభుత్వం ముంపు బాధితులకు సరైన పరిహారం, భరోసా ఇవ్వకుండా మానవత్వం లేకుండా వ్యవహరించింది. పోలవరం విషయంలోనూ ఇప్పటికీ రైతులకు న్యాయం జరగడం లేదు. అక్కడి పాలకులు చంద్రబాబు, జగన్‌లుకూడా ఇందుకు తీసిపోలేదు. నిర్వాసితులకు నేటికీ పరిహారం చెల్లించడం లేదు. వారిని బిచ్చగాళ్లు గా మార్చి రోడ్డున పడేశారు. గంగవరం పోర్టు సమయలోనూ మత్స్యకారులను తన్ని తరిమేశారు. చివరకు ఇప్పుడు గంగవరం పోర్టును ఆదానికి కట్టబెట్టారు. విశాఖ ఉక్కుకోసం రైతులు భూములు ఇస్తే వాటిని తీసుకున్న ప్రభుత్వం ఇప్పుడు ఆ భూములకు విలువ పెరగడంతో మొత్తంగా ఉక్కు ఫ్యాక్టరీనే ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించింది. ఇలా అమరావతి నిర్మాణం కోసం కూడా రైతుల నుంచి బలవంతంగా భూసేకరణ చేశారు. వారిని బెదిరించి, కొట్టి గుంజుకున్నారు. మూడు పంటలు పండే భూములు ఇప్పుడు నిరుపయోగం చేశారు. ఫార్మా సిటీ పేరుతో ఇప్పుడు రంగారెడ్డి జిల్లాలో ఎకరా రెండుకోట్లు చేసే భూములను లాక్కుం టున్నారు. వారిని లాఠీలతో కొట్టించి, జైళ్లలో కుక్కి పంపిస్తున్నారు. తాజాగా కామారెడ్డి మాస్టర్ ప్లాన్‌కు వ్యతిరేకంగా రైతుల ఆందోళన కూడా భూములను గుంజుకోవడం వల్ల కలుగుతున్న చర్యకు ప్రతీకార చర్యగాచూడాలి. ఓ రైతు ఆత్మహత్యచేసుకున్నాడు. అయినా చీమకుట్టినట్లు లేదు. రైతు మరణాన్ని వెటకా రంగా మాట్లాడుతున్న మంత్రివర్యులు మనకున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే అంతా కన్నీటి చరిత్రే. రైతులను దగా చేయడానికే పాలకులు పుట్టారని అనుకోవాలి. భూసేకరణ విధానాలు మారాలి. రైతులకు భూమికి భూమితో పాటు పరిహారం ఇచ్చే పరిస్థితి రావాలి. ప్రభుత్వాల దౌర్జన్యాలు ఆగకుండా చేయాలి. అప్పుడే ప్రజలు బాగుపడతారు. తాజాగా కామారెడ్డితో అయినా పాలకులకు మేల్కోవాలి. కళ్లు తెరిచి రైతులకు న్యాయంచేసే విధానాలను ఆలోచించి అమలు చేయాలి. ప్రజలకు న్యాయం కోసం పనిచేయాలి. దౌర్జన్యాలకు స్వస్తి చెప్పకపోతే మూల్యం చెల్లించుకోక తప్పదు.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# విమానంలో మహిళపై మూత్రవిసర్జన కేసు

### ఎట్టకేలకు నిందితుడు శంకర్ మిశ్రా అరెస్ట్ ■ బెంగళూరులో పట్టుకున్నపోలీసులు




**బెంగళూరు, జనవరి 7 (సమ సమాజం):** ఎయిరిండియా విమానంలో ఓ వృద్ధ మహిళపై మూత్ర విసర్జన చేసిన ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం అతన్ని కస్టడీకి తరలించారు. గత కొన్ని రోజులుగా పరారీలో ఉన్న నిందితుడు శంకర్ మిశ్రాను ఢిల్లీ పోలీసులు శనివారం ఉదయం బెంగళూరులో అరెస్టు చేశారు. ఈ కేసులో ఎయిరిండియా ఫిర్యాదు మేరకు అతడిపై కేసు నమోదైంది. గతేడాది నవంబరు 26న న్యూయార్క్ నుంచి ఢిల్లీ వచ్చిన విమానంలో చోటుచేసుకున్న ఈ ఘటనలో బాధిత మహిళ టాటా గ్రూప్ ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్‌కు లేఖ రాసింది. దీని గురించి చెప్పినా ఎయిరిండియా సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆమె ఆరోపించింది. దీంతో ఎయిరిండియాపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే నిందితుడిపై ఎయిర్‌లైన్ 30 రోజుల నిషేధం విధించింది. ఈ ఘటన వెలుగులోకి వచ్చినప్పటి నుంచి శంకర్ కనిపించకుండా పోయాడు. ఈ మేరకు ఢిల్లీ పోలీసులు లుక్‌అవుట్ నోటీసులు కూడా జారీ చేశారు. ఈ సమయంలోనే అతడు బెంగళూరులో ఉన్నట్లు సమాచారం రావడంతో పోలీసులు అక్కడికి వెళ్లి శంకర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఫోన్ స్విచాఫ్ చేసినప్పటికీ.. సోషల్‌మీడియా, క్రెడిట్ కార్డులను వినియోగించారని, దానివల్లే ఆచూకీ గుర్తించగలిగామని పోలీసులు తెలిపారు. అయితే ఈ ఘటనపై స్పందించిన శంకర్ మిశ్రా.. బాధితురాలికి తగిన నష్టపరిహారం చెల్లించానని, వివాదం అక్కడితో సమసిపోయిందని తెలిపారు. అయితే నష్టపరిహారం చెల్లించిన నెల రోజుల తర్వాత బాధితురాలి కుమార్తె ఆ డబ్బును తిరిగి పంపించేశారని వివరించారు. ఈ మేరకు మిశ్రా తరపు న్యాయవాదులు ఓ ప్రకటనను విడుదల చేశారు. బాధితురాలి పాడైపోయిన బ్యాగ్, దుస్తులను మిశ్రాకు పంపారని, ఆయన వాటిని ఉతికించి నవంబరు 30నే ఆవిడకు అందజేశారన్నారు. అమెరికా ఆర్థిక సేవల సంస్థ వెల్స్ ఫార్గో భారత విభాగానికి ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్న శంకర్ మిశ్రాను.. ఘటన నేపథ్యంలో సంస్థ ఉద్యోగం నుంచి తొలగించింది.

# రుణాల కింద రైతుబంధు నగదు జమ

### వరుస కథనాలపై మంత్రి హరీష్ రావు స్పందస

### తక్షణ విచారణకు మంత్రి ఆదేశాలు



**హైదరాబాద్, జనవరి 7 (సమ సమాజం):** అన్నదాతల ఖాతాల్లో జమ అయిన రైతుబంధు నిధులను కొందరు బ్యాంకర్లు రుణాలు, ఇతర బకాయిల కింద జమ చేసుకోవడంపై ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుబంధు నిధులు బ్యాంకు దాటి రైతుల ఖాతాలకు రావడం లేదన్న కథనాలపై హరీశ్‌రావు స్పందించారు. ఈ నగదు కేవలం రైతులకు పెట్టుబడి సాయం కింద మాత్రమే వాడుకునేలా చేయాలన్నారు. ఈ విషయమై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితిని మంత్రి ఆదేశించారు. రైతుబంధు నిధులను ఎట్టిపరిస్థితుల్లోనూ బకాయిలకు జమ చేసుకోరాదని మంత్రి స్పష్టం చేశారు. స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ నిబంధనలను బ్యాంకర్లు అందరూ విధిగా పాటించాలని పేర్కొన్నారు. పంట పెట్టుబడి సాయం కోసం రైతుబంధు ద్వారా రైతులకు ఇచ్చే నగదు మొత్తాన్ని వారి ఖాతాల్లో జమ చేయాలని మంత్రి సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా అన్ని బ్యాంకులు ఎస్ఎల్‌బీసీ నిబంధనల ప్రకారం రైతుబంధు పంట పెట్టుబడి సహాయాన్ని పాత బకాయిల కింద జమచేయకుండా ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించవలసిందిగా మంత్రి ఆదేశించారు. ఈ ఘటనపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఎస్ఎల్‌బీసీ సెక్రటరీని మంత్రి కోరారు.

# కామారెడ్డి ఆందోళనకు కెఎ పాల్ మద్దతు



**హైదరాబాద్, జనవరి 7 (సమ సమాజం):** కామారెడ్డి రైతుల ఆందోళనకు ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కెఏ పాల్ మద్దతు తెలిపారు. మాస్టార్ ఎ÷-లాన్ విషయంపై కామారెడ్డి కలెక్టర్ ని కలిసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. భూములు పోతాయని ఎవరూ ఆత్మహత్యలు చేసుకోవదని సూచించారు. రైతుల తరపున తాను పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు. సమస్య శాంతియుతంగా పరిష్కరించాలని కలెక్టర్ ని కోరానని చెప్పారు. కామారెడ్డి మాస్టర్ ప్లాన్ కు వ్యతిరేకంగా 3వ రోజు రైతుల ఆందోళన కొనసాగుతోంది.బంద్ సందర్భంగా రైతులపై దాడికి నిరసనగా కలెక్టరేట్ దగ్గర రైతుల ఆందోళన చేపట్టారు. మరోవైపు జిల్లా కలెక్టర్ తీరుపై రైతులు ఆగ్రహంతో ఉన్నారు. ఇప్పటి వరకు రైతులను కలెక్టర్ కలవలేదు.

# కూకట్‌పల్లిలో కూలిని భవన సెంట్రింగ్

## ఇద్దరు కార్మికులకు గాయాలు

**హైదరాబాద్, జనవరి 7 (సమ సమాజం):** హైదరాబాద్ కూకట్‌పల్లిలో దారుణం జరిగింది. నిర్మాణంలో ఉన్న భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. నాల్గో ఫ్లోర్ కు సెంట్రింగ్ పనులు చేస్తుండగా మూడో అంతస్థు శ్లాబ్ ఒక్కసారిగా కూలిపోయింది. నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో బిల్డింగ్ కూలడంతో పలువురు కూలీలు శిథిలాల కింద చిక్కుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు ఇద్దరు కూలీలను బయటకు తీయగా.. తీవ్రంగా గాయపడిన వారిని దగ్గరలోని హాస్పిటల్ కు తరలించి చికిత్స అందిస్తున్నారు. కూకట్‌పల్లి బీజేపీ పార్టీ ఆఫీసు పక్కనే ఈ నిర్మాణం జరుగుతోంది. బిల్డింగ్ పనులు త్వరగా పూర్తిచేయాలన్న తొందరే ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. నాసిరం పనులే ప్రధాన కారణమని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. జీహెచ్ఎంసీ సిబ్బంది శిథిలాలను తొలగిస్తున్నారు.



# ఆటోమొబైల్ కంపెనీల రుణాల ఎగవేత

### నగరంలో ఆరుచోట్ల సిబిఐ సోదాలు




**హైదరాబాద్, జనవరి 7 (సమ సమాజం):** నగరంలో సీబీఐ సోదాలు నిర్వహిస్తోంది. పాతబస్తీలో ఆరు చోట్ల సీబీఐ అధికారులు తనిఖీలు జరుపుతున్నారు. ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీకి చెందిన ఆఫీసుల్లో సోదాలు కొనసాగుతున్నాయి. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న సదరు సంస్థ తిరిగి చెల్లించలేదు. దీంతో బ్యాంకుల ఫిర్యాదు మేరకు సీబీఐ గతంలోనే కేసు నమోదు చేసింది. తాజాగా సదరు ఆటోమొబైల్ కంపెనీ కార్యకలాపాలపై దృష్టి సారించిన అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. పాతబస్తీ ఆజంపురాలోని డాక్టర్ అంజుమ్ సుల్తానా ఇంట్లోనూ సీబీఐ తనిఖీలు జరుపుతోంది. ఆమె భర్త ఆటోమొబైల్ కంపెనీలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. అధికారులు కంపెనీకి సంబంధించిన డాక్యుమెంట్లు, లావాదేవీలకు సంబంధించిన వివరాలను తెలుసుకునే ప్రయత్నంలో ఉన్నారు.

# పంత్ మోకాలి గాయానికి శస్త్రచికిత్స

### డాక్టర్ల పర్యవేక్షణలో క్రికెటర్



**ముంబై, జనవరి 7 (సమ సమాజం):** కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన టీమిండియా ప్లేయర్ రిషబ్ పంత్ కోలుకుంటున్నాడు. ముంబై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రిషబ్ పంత్ మోకాలికి డాక్టర్లు శస్త్ర చికిత్స చేశారు. ముంబైలోని ఆసుపత్రిలోనే పంత్ మోకాలి లిగమెంట్లకు విజయవంతంగా శస్త్రచికిత్స జరిగిందని బీసీసీఐ వెల్లడించింది. పంత్ మోకాలి లిగమెంట్లకు ముంబైలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆస్పత్రిలో సక్సెస్ ఫుల్‌గా సర్జరీ అయింది. ప్రస్తుతం పంత్‌ను డాక్టర్లు పరిశీలనలో ఉంచారు. అయితే రాబోయే రోజుల్లో ఏం చేయాలి.. రిహాబిలిటేషన్‌కు ఎప్పుడు పంపించాలి అనేది డాక్టర్ దిన్షా పార్దీవాలా నేతృత్వంలోని వైద్యబృందం తెలపనుంది. ఉత్తరాఖండ్‌లోని రూర్కీలో కారు ప్రమాదంలో రిషబ్ పంత్ గాయపడ్డాడు. అతని తలకు రెండు గాట్లతో పాటు మోకాలిలోని లిగమెంట్లలో చీలిక ఏర్పడింది. ఈ గాయాల నుంచి పంత్ కోలుకోవడానికి కనీసం 9 నెలలు పడుతుందని డాక్టర్లు తెలిపారు. ప్రస్తుతం అతని మోకాలి లిగమెంట్లకు ముంబైలోని కోకిలా బెన్ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స జరిగింది.

# తెలంగాణలో 41 కుల సంఘాల భవనాలు

### యాదవ ఆత్మగౌరవ భవన నిర్మాణ పనులు పరిశీలించిన మంత్రి



**హైదరాబాద్, జనవరి 7 (సమ సమాజం):** తెలంగాణలో 41 కుల సంఘాల భవనాలకు స్థలాలను కేటాయిస్తూ నిర్మిస్తున్న ప్రభుత్వం తెలంగాణయేనని రాష్ట్ర పశుసంవర్ధక, సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. కోకాపేటలో యాదవ ఆత్మగౌరవ భవన నిర్మాణ పనులు యాదవ, కురుమ ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. నిర్మాణ పనుల గురించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. గొల్ల, కురుమల అభివృద్ధికి కృషి చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని కొనియాడారు. త్వరలోనే ముఖ్యమంత్రి చేతుల మీదుగా భవనాన్ని ప్రారంభించబోతున్నామని వెల్లడించారు.గొల్ల, కురుమలు రాజకీయంగా, సామాజికంగా ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. కొన్ని రాజకీయ పార్టీలు ఎన్నికలు రాగానే కుల సంఘాల వారిని వాడుకుని వదిలివేసేవారని విమర్శించారు. బీఆర్ఎస్ అందుకు భిన్నంగా అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటివరకు అన్ని కులాలు,వర్గాల వారికి సముచిత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. నిజాం కాలేజీ గ్రౌండ్‌లో మేరు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేరు క్రికెట్ లీగ్ ను మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యే నోముల భగత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ ఐక్యమత్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

# అంజలి కేసులో అరెస్టయిన నిధిపై డ్రగ్స్ కేసు

### మద్యం తాగి స్కూటీ నడపడం వల్లే ప్రమాదం అని వెల్లడి

### కొట్టి పారేసిన అంజలి తల్లిదండ్రులు

**న్యూఢిల్లీ, జనవరి 7 (సమ సమాజం):** కొత్త సంవత్సరం రోజున దేశరాజధాని ఢిల్లీ శివారు కాంజావాల్ ప్రాంతంలో 20 ఏండ్ల యువతిని కారు ఈడ్చుకెళ్లిన దారుణ ఘటనలో అంజలి అనే యువతి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ ఘటనలో.. కేసు విచారణలో భాగంగా ఆసక్తికర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో ప్రధాన సాక్షిగా ఉన్న నిధి గతంలో డ్రగ్స్ స్మగ్లింగ్ కేసులో అరెస్టైనట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. ఓ వార్తా సంస్థ తెలిపిన వివరాల ప్రకారం.. 2020 ఏడాది డిసెంబర్ 6వ తేదీన డ్రగ్స్ తరలిస్తూ నిధిని ఆగ్రా రైల్వే స్టేషన్‌లో పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేశారు. ఆమెతోపాటు మరో ఇద్దరు వ్యక్తులు సమీర్, రవిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం బెయిల్‌పై నిధి బయటకొచ్చింది. ఈ పరిణామంతో అంజలి డెత్ కేసులో నిధి పాత్ర ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, ప్రమాద సమయంలో అంజలితోపాటు స్కూటీపై నిధి కూడా ఉన్నట్లు దర్యాప్తులో తెలుసుకున్న పోలీసులు ఆమెను ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో మీడియాతో మాట్లాడిన నిధి.. అంజలిపై పలు ఆరోపణలు చేసింది. మద్యం సేవించిన అంజలి స్కూటీ నడుపుతానని తనతో గొడవపడినట్లు చెప్పింది. మద్యం మత్తులో స్కూటీని స్పీడ్‌గా డ్రైవ్ చేసి కారును ఢీకొట్టినట్లు ఆరోపించింది. కారు కింద అంజలి చిక్కుకున్న విషయం తెలిసినప్పటికీ అందులోని వ్యక్తులు ఈడ్చుకెళ్లారని నిధి తెలిపింది. అయితే నిధి ఆరోపణలను అంజలి తల్లి ఖండించింది. నిధికి మద్యం అలవాటు లేదని.. నిధి అబద్ధం చెబుతోందని తెలిపింది. అంజలి మృతి కుట్రలో నిధి భాగమై ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో నిధిని శుక్రవారం విచారణకు పిలిచిన పోలీసులు.. ఆమెపై ప్రశ్నల వర్షం కురిపించారు.

# హాస్టల్లో సెల్‌ఫోన్ చోరీ

### టెన్త్ విద్యార్థిని చితకబాదిన ప్రిన్సిపాల్

**హనుమకొండ, జనవరి 7 (సమ సమాజం):** తల్లీదండ్రుల తరువాతీ స్థానం గురువులదే. అలాంటి గురువులే విద్యార్థుల పాలిట యబభటులుగా మారుతున్నారు. పిల్లలను ప్రేమగా చూసుకోవాల్సిన కొంతమంది గురువులు పిల్లల పట్ల అమానుషంగా ప్రవర్తిస్తున్నారు. చిన్నచిన్న తప్పులకు కూడా కఠిన శిక్షలు వేస్తున్నారు. కానీ, ఇక్కడ మాత్రం ఏ తప్పు చేయని ఓ విద్యార్థిని ప్రిన్సిపల్ ఇష్టం వచ్చినట్లు కొట్టాడు. పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని వాతలు వచ్చేలా కొట్టాడు. బాధితుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లాలోని కమలాపూర్ మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలలో ఓ విద్యార్థి 10వ తరగతి చదువుతున్నాడు. గురుకుల పాఠశాల్లోనే ఉంటూ చదువుకుంటున్నాడు. హాస్టల్ లో వంట పని చేసే ఓ వ్యక్తి సెల్ ఫోన్ చోరీకి గురైంది. ఆ సెల్ ఫోన్ ను విద్యార్థే తీశాడని ప్రిన్సిపల్ వెంకటరమణకు ఎవరో చెప్పడంతో సదరు విద్యార్థిని, అతడి తల్లిని పిలిపించాడు. తల్లి ముందే విద్యార్థిని ప్రిన్సిపల్ విచక్షణ రహితంగా కొట్టాడు. తమ కుమారుడు సెల్ ఫోన్ దొంగతనం చేయలేదని చెప్పినా ప్రిన్సిపల్ వినలేదని, కోపంతో తమ కుమారుడిని బూటు కాళ్లతో తన్నాడని బాధితుడి తల్లి ఆరోపించింది. తమ కుమారుడిని కొట్టొద్దని కాళ్లపై పడి వేడుకున్నా అసలు వినిపించుకోలేదని వాపోయింది. అసలు విషయం తెలుసుకున్న తర్వాత ప్రిన్సిపల్ తన తప్పును ఒప్పుకున్నాడని బాధితుడి తల్లి చెప్పింది. తనకు కొంతమంది తప్పుడు సమాచారం అందించారని, దాంతో సెల్ ఫోన్ చేశాడనే అనుమానంతో అతడిని కొట్టినట్లు ప్రిన్సిపల్ చెప్పాడని మీడియా ప్రతినిధుల వద్ద కన్నీటి పర్యంతమైంది. ప్రిన్సిపల్ తీరుపై విద్యాశాఖ ఉన్నతాధికారులకు విద్యార్థి తల్లి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.

# కోహెడలో అత్యాధునిక చేపల మార్కెట్



(మొదటి పేజి తరువాయి) ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. ఈ విషయంపై శ్రీనివాస్ యాదవ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. చేపల పెంపకంలో తెలంగాణ ప్రస్తుతం అగ్రస్థానంలో ఉందని మంత్రి తలసాని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత చేపల ఉత్పత్తి 1.9 లక్షల టన్నుల నుంచి 4 లక్షల టన్నులకు పెరిగిందన్నారు. మత్స్యకారులకు మంచి ధర లభించేలా రాష్ట్రవ్యాప్తంగా ఆధునిక చేపల మార్కెట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అన్ని జిల్లాల్లో గొర్రెలు, మేకల మాంసం మార్కెట్‌ను నిర్మించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. జిల్లాల్లో మాంసం మార్కెట్ల ఏర్పాటుకు స్థలాలను గుర్తించి ఆయా జిల్లాల కలెక్టర్లకు ప్రతిపాదనలు పంపాలని కోరారు.

# ఆలయాల పునరుద్దరణకు కెసిఆర్ చర్యలు



(మొదటి పేజి తరువాయి) కొనసాగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శివరాత్రికి పాలకుర్తి కళ్యాణ మండపం ప్రారంభం చేసుకుంటున్నామని,ఆది కవి పాల్కురి సోమనాథుడి విగ్రహం ప్రతిష్టిస్తున్నామని వివరించారు. ఈ ప్రాంతంలో టూరిజం శాఖ ఆధ్వర్యంలో రూ. 25 కోట్ల వ్యయంతో హరిత హోటల్‌ను నిర్మిస్తున్నామని వెల్లడించారు. హోటల్ కోసం స్థలం ఇచ్చిన స్థానికులకు వేరే చోట ఇండ్లు ఇచ్చి, టూరిజంలో ఉద్యోగాలు ఇస్తున్నామని తెలిపారు. బమ్మెరలో 22 అడుగుల పోతన విగ్రహం తయారు చేస్తున్నామని ఆయన తెలిపారు. వల్మిడి గుట్ట పై వాల్మీకి భారీ విగ్రహం పెడుతున్నామని మంత్రి తెలిపారు. వారి వెంట అదనపు కలెక్టర్ ప్రపోల్ దేశాయ్, దేవాలయ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నిపుణులు ఉన్నారు.

# కామారెడ్డి మాస్టర్ ప్లాన్‌పై అపోహలు వీడండి



(మొదటి పేజి తరువాయి) చేయడానికి ఇంకా సమయం ఉందని తెలిపారు. 2000లో పాత మాస్టర్ ప్లాన్ తయారైందని... అప్పుడు కూడా ఇలాంటి జోన్లు పెట్టారని...వాటిలోని భూములను ఎవరూ డిస్టర్బ్ చేయలేదని గుర్తుచేశారు. ఇప్పుడు ఎందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ప్రశ్నించారు. నూతన మాస్టర్ ప్లాన్‌పై ఇప్పటి వరకు 1026 అభ్యంతరాలు వచ్చాయని.. అన్నీ పరిశీలిస్తామని తెలిపారు. జనాల అభిప్రాయాలపై చర్చ ఉంటుందని... తర్వాత పై స్థాయిలో ఫైనల్ అవుతుందన్నారు. ఇండస్ట్రియల్ జోన్ కింద మార్క్ అయి ఉంటుందని తెలిపారు. భూమికి, భూ యజమానులకు ఎలాంటి నష్టం ఉండదని తేల్చిచెప్పారు. ఈనెల 11 వరకు అభ్యంతరాలు ఇవ్వచ్చని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. నిబంధనల ప్రకారమే కొత్త మాస్టర్ ప్లాన్ రూపొందించాం అని స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన పరిణామాలను దృష్టిలో ఉంచుకొని పలు విషయాలను ఆయన వెల్లడించారు. ప్రస్తుతం ఇచ్చింది ముసాయిదా మాస్టర్ ప్లాన్ మాత్రమే అని స్పష్టం చేశారు. ముసాయిదాలో మార్పులు, చేర్పులు జరుగుతాయన్నారు. రైతుల అభ్యర్థనలను నమోదు చేసుకుంటామని తెలిపారు. రైతుల అభ్యర్థనలను అన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ఎవరైనా సరే సూచనలు ఇవ్వొచ్చని ఇప్పటికే ప్రకటించామని తెలిపారు. 60 రోజుల్లో సలహాలు, సూచనలు ఇవ్వొచ్చని ఫ్లెక్సీలు కూడా ఏర్పాటు చేశామని చెప్పారు. ఇప్పటి వరకు 1026 అభ్యంతరాలు వచ్చాయి. రైతులకు ఇంకా ఏమైనా అభ్యంతరాలు ఉంటే మా దృష్టికి తీసుకురండి. జనవరి 11న సాయంత్రం 5 గంటల వరకు అభిప్రాయాలు చెప్పొచ్చు అని కామారెడ్డి కలెక్టర్ తెలిపారు. భూములు పోతాయని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. భూములు పోతాయని ఎందుకు అపోహ పడుతున్నారో తెలియడం లేదన్నారు. భూములు పోతాయన్నది తప్పుడు సమాచారమే అని స్పష్టం చేశారు. కంగారు పడాల్సిన అవసరం లేదు. పట్టణం ఎలా విస్తరిస్తుందో.. దాని ప్రకారమే మాస్టర్ ప్లాన్ ఉంటుంది. ముసాయిదా ఫైనల్ కావాడానికి చాలా దశలు ఉన్నాయి. ఇది ఇంకా మొదటి దశలోనే ఉంది. రైతుల భూములు ఎక్కడికి పోవు. మీ భూమి మీ పేరు మీదనే ఉంటుందన్నారు. మా దృష్టికి వస్తున్న అభ్యర్థనలను పరిశీలించి, నివృత్తి చేస్తున్నామని తెలిపారు. ఇండస్ట్రియల్ జోన్ అంటే భూముల సేకరణ కాదు అని కలెక్టర్ జితేశ్ పాటిల్ స్పష్టం చేశారు.

# పార్టీ ఫిరాయింపులతో రాజకీయ వ్యభిచారం

## మండిపడ్డ మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్, జనవరి 7 (సమ సమాజం):** పార్టీ ఫిరాయింపులతో కేసీఆర్ రాష్ట్ర రాజకీయాలను వ్యభిచారంగా మార్చారని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మెజార్టీ ఉన్నా కావాలనే కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేశారని మండిపడ్డారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... ఫామ్‌హౌస్ ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో ఉన్న ఎమ్మెల్యేలు ముగ్గురు కాంగ్రెస్ నుంచి అమ్ముడు పోయిన వాళ్ళే అని అన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై తాము చేసిన ఫిర్యాదులపై దొంగే దొంగా దొంగా అని అరిచినట్లుగా అమ్ముడు పోయిన ఎమ్మెల్యే మాట్లాడుతున్నారన్నారు. రేవంత్ రెడ్డి తాను పార్టీ మారినప్పుడు పార్టీ అధ్యక్షుడికి రాజీనామా ఇచ్చినట్లు తెలిపారు. మీరు ఏం చేశారు .. మీరు పీసీసీకి రాజీనామా ఇచ్చారా అని ప్రశ్నించారు. దొంగలు పడ్డ ఆరు నెలలకు కుక్కలు మొరిగాయని పైలెట్ రోహిత్ అంటున్నారని.. అంటే తాను దొంగ అని రోహిత్ రెడ్డి ఒప్పుకున్నట్లే కదా అని మాజీ ఎంపీ యెద్దేవా చేశారు.

# నిర్మల్ సబ్‌జైలులో రిమాండ్ ఖైదీ మృతి



(మొదటి పేజి తరువాయి) జైలు వర్గాలు చెబుతున్నాయి. మృతుడు సతీష్ కుటుంబ సభ్యులు మాత్రం ఈ మరణం వెనుక అనుమానాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సతీష్ రెండు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుంటే జైలు అధికారులు ఆస్పత్రికి తీసుకెళ్లకుండా ఏం చేశారని ప్రశ్నిస్తున్నారు. సీరియస్ అయ్యే వరకు ఎందుకు చూస్తూ ఉండిపోయారని నిలదీస్తున్నారు. తమ కొడుకుకి ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవని తల్లిదండ్రులు వాదిస్తున్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.



# అమెజాన్‌లో ఉద్యోగుల తొలగింపు

(మొదటి పేజి తరువాయి) అమెజాన్ స్టోర్స్, పీఎక్స్‌టీ ఆర్గనైజేషన్స్ నుంచి ఉద్యోగులను తొలగిస్తున్నట్టు ప్రకటించారు. ఇక ప్రముఖ టెక్ కంపెనీ 'సేల్స్‌ఫోర్స్' కూడా అమెజాన్ బాటలోనే నడుస్తున్నది. ఈ ఏడాది తమ కంపెనీలోని 8 వేల మందిని (10శాతం) ఉద్యోగులను తొలగించనున్నట్టు ప్రకటించింది. అలాగే, కొన్ని కార్యాలయాలను కూడా మూసివేస్తున్నట్టు తెలిపింది.

# నగరంలో వరుస చైన్ స్నాచిగ్‌లు



(మొదటి పేజి తరువాయి) అదుపులోకి తీసుకున్నారు. గంటల వ్యవధిలోనే నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. కాచిగూడ నుంచి ట్రైన్‌లో పారిపోతుండగా చైన్ స్నాచర్లు పట్టుబడ్డారు. శనివారం ఉదయం ఉప్పల్ నుంచి రాంగోపాల్ పేట వరకు మొత్తం ఆరు చోట్ల దుండగులు చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డారు. ఉదయం 6:20 గంటల నుంచి మొదలైన స్నాచింగ్‌లు 8:10 గంటలకు ముగిశాయి. ఉప్పల్, నాచారం, ఓయూ, రాంగోపాల్ పేట్ పరిధిలో దొంగలు చైన్ స్నాచింగ్స్ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు స్నాచర్లను పట్టుకునేందుకు పోలీస్ బృందాలు రంగంలోకి దిగారు. దుండగుల కోసం హైదరాబాద్‌లోని అన్ని చోట్ల పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. చివరకు కాచిగూడ నుంచి ట్రైన్‌లో పారిపోతుండగా...వరంగల్ కాజీపేట రైల్వేస్టేషన్‌ను చైన్ స్నాచర్లను పోలీసులు పట్టుకున్నారు.

# కామారెడ్డిలో ఇంకా చల్లారని ఉద్రిక్తతలు




(మొదటి పేజి తరువాయి) నాయకులు, కార్యకర్తలతో కలిసి జిల్లా కలెక్టరేట్ ను బండి సంజయ్ ముట్టడించారు. ఈ సందర్భంగా అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. రైతులు, బీజేపీ కార్యకర్తలు.. పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. తోపులాటలో కొంతమంది బీజేపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. కొందరు సొమ్మసిల్లి కిందపడి పోయారు. చివరకు పోలీసులు బండి సంజయ్ ని అదుపులోకి తీసుకొని హైదరాబాద్‌కు తరలించారు. రైతుల పోరాటానికి అండగా ఉంటామని, మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేసేంత వరకూ ఉద్యమిస్తామని బండి సంజయ్ హెచ్చరించారు. ఇండస్ట్రియల్ జోన్‌కు బీజేపీ వ్యతిరేకం కాదని, కానీ దాని కోసం ఏడాదికి రెండు పంటలు పండే భూములను లాక్కోవడం సరికాదన్నారు. మాస్టర్ ప్లాన్‌కు వ్యతిరేకంగా, కలెక్టర్ తీరుకు నిరసనగా రైతు జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన కామారెడ్డి బంద్ సక్సెస్ అయింది. పట్టణంలోని దుకాణాలు, సినిమా హాల్స్, హోటళ్లు, ప్రైవేట్ విద్యాసంస్థలను మూసేసి తమ నిరసనలు తెలిపారు. బంద్‌కు బీజేపీ, కాంగ్రెస్ మద్దతు ఇచ్చాయి. పట్టణ శివార్లలో పెద్ద ఎత్తున బలగాలను మోహరించిన పోలీసులు.. వివిధ గ్రామాల నుంచి కామారెడ్డికి వస్తున్న రైతులు, బీజేపీ, కాంగ్రెస్ లీడర్లను ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. బంద్ సందర్భంగా రైతులు, బీజేపీ, కాంగ్రెస్‌కు చెందిన 170 మంది నేతలను అరెస్టు చేశారు. ఇకపోతే తాజాగా అక్కడ పరిస్థితులను పోలీసులు పరిశీలిస్తున్నారు.

# కొత్త మెడికల్ కాలేజీలను త్వరగా పూర్తి చేయాలి



(మొదటి పేజి తరువాయి)ఏడాది కరీంనగర్, ఖమ్మం, కామారెడ్డి, వికారాబాద్, జనగాం, నిర్మల్, భూపాలపల్లి, సిరిసిల్ల, ఆసిఫాబాద్ జిల్లాల్లో ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి సూచించారు. ఇక నిర్మాణంలో ఉన్న మాతాశిశు సంరక్షణ కేంద్రాలను వెంటనే పూర్తి చేయాలని మంత్రి హరీష్ చెప్పారు. నిమ్స్ గాంధీ ఆసుపత్రిలో నిర్మిస్తున్న ఎంసీహెచ్ ఆసుపత్రులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. టీవీవీపీ పరిధిలో కొనసాగుతున్న 23 సీహెచ్సీల పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే 20 తెలంగాణ డయాగ్నొస్టిక్ సెంటర్లు ఉన్నాయని, వివిధ జిల్లాల్లో కొత్తగా ఏర్పాటు చేస్తున్న 13 సెంటర్లను త్వరగా అందుబాటులోకి తీసుకువచ్చేలా పనిచేయాలన్నారు. మార్చురీల పనులు, 12 సెంట్రల్ మెడిసిన్ స్టోర్స్ పనులు వేగంగా పూర్తి చేయాలి తెలిపారు. ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాల సమీపంలో 9 క్రిటికల్ కేర్ హాస్పిటల్స్ ఏర్పాటు చేస్తున్నామని, ఈ పనులు త్వరగా పూర్తి చేసి యాక్సిడెంట్స్ బాధితులకు సకాలంలో వైద్యం అందేలా చూడాలని సూచించారు. మరోవైపు అన్ని ఆసుపత్రుల్లో మందులు అందుబాటులో ఉండేలా చూడాలని, మూడు నెలల బఫర్ స్టాక్ మెంటెయిన్ చేయాలని మంత్రి హరీష్ రావు తెలిపారు. మందుల సరఫరాలో ఎలాంటి నియంత్రణ ఉండవద్దని, అవసరమైన మేరకు మందులు ఆయా ఆస్పత్రులకు పంపిణీ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య పరీక్షలు నిర్వహించి, 24 గంటల్లోగా పరీక్ష ఫలితాలు వచ్చేలా చూడాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని వైద్య పరికరాలు నిత్యం పనిచేసే విధంగా ఉండేందుకు గాను, తక్షణం రిపేర్లు చేసేందుకు ఏర్పాటు చేసుకున్న ఇ ఉపకరణ్ పోర్టల్ ను పూర్తిగా వినియోగించాలన్నారు. వైద్య పరికరాలు చెడిపోయిన సమయంలో వెంటనే ఉపకరణ్ లో అప్ డేట్ చేయాలని, తద్వారా సకాలంలో రిపేర్ చేయడం జరుగుతుందని మంత్రి చెప్పారు. ఆస్పత్రుల్లో వైద్య పరికరాలు పూర్తిస్థాయిలో పనిచేసే విధంగా చూసుకోవడం సూపరింటెండెంట్?ల బాధ్యతేనన్నారు. ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేస్తూ వైద్య పరికరాలు సమకూర్చుతున్నదని ఇవి ప్రజలకు పూర్తిస్థాయిలో సద్వినియోగపడేలా చూడటం మన బాధ్యతనని వెల్లడించారు.

# మా మంత్రులకు కళ్లద్దాలు ఇవ్వండి



(మొదటి పేజి తరువాయి) సమస్యలు కనిపించేలా, కళ్ళు బాగా పనిచేసేలా కంటివెలుగు అద్దాలు ఇప్పించండి అంటూ వేడుకున్నారు. మీరెలాగు ఆ అద్దాలు పెట్టుకున్నారు కాబట్టి ఒక్కసారి తమ గోస చూసి పోండి... లేదంటే అన్ని సమస్యలు తీరినట్లు కేసీఆర్ అన్నట్టు ఎటు చూసినా డల్లాస్, ఇస్తాంబుల్ లెక్క కనిపించే గ్రాఫిక్స్ కళ్లద్దాలు అయినా వరంగల్ ప్రజలకు మనిషికో జత ఇప్పించండి మంత్రిగారు అంటూ సెటైరికల్ రీతిలో రాకేష్ రెడ్డి లేఖలో పేర్కొన్నారు.

# సరళ్ యాప్ విడుదల చేసిన బండి

## ఆరు నెల్లలో ఎన్నికలు తప్పవని వెల్లడి

## బూత్ కమిటీలను పటిష్టం చేయాలని పిలుపు



**హైదరాబాద్, జనవరి 7 (సమ సమాజం):** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. శనివారం నిర్వహించిన పోలింగ్ బూత్ కమిటీ సమ్మేళనంలో ప్రసంగించిన బండి... తెలంగాణలో ఆరు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు రావొచ్చని జోస్యం చెప్పారు. బూతుస్థాయికమిటీలే కీలకమని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా పోలింగ్ బూత్ అధ్యక్షుడిగా పనిచేశారని తెలిపారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలంటే పోలింగ్ బూత్ సభ్యులే ముఖ్యమన్నారు. సరల్ యాప్ ద్వారా కేంద్ర పథకాలు, బీజేపీ కార్యక్రమాలు, కేంద్రం తెలంగాణకు ఇచ్చిన నిధులను ప్రజల్లోకి తీసుకెళ్ళామని తెలిపారు. తెలంగాణకు కేంద్రం ఇచ్చిన నిధులపై చర్చకు సిద్ధమని.. రాజీనామా పత్రంతో కేసీఆర్ రెడీగా ఉండాలని అన్నారు. తెలంగాణలో పేదల రాజ్యం రావాలన్నదే బీజేపీ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తే బీజేపీ వద్దంటుందని కేసీఆర్ కుటుంబం తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. నోటిఫికేషన్లు జారీ చేస్తారు కానీ నియామకాలు జరపరన్నారు. స్మార్ట్ సిటీ, ఉపాధి హామీ, గ్రామ పంచాయతీ, హరిత హారం కింద కేంద్రం ఇచ్చిన నిధులను కేసీఆర్ సర్కారు దారి మళ్ళిస్తోందని ఆరోపించారు. రుణమాఫీ చేయకపోవడంతో బ్యాంకులు రైతుబంధు డబ్బులను బకాయిల కింద జమ చేసుకున్నాయన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కేసీఆర్ ఎత్తుకుపోయాడాని ఇప్పుడు ఫిర్యాదు చేయడం ఆశ్చర్యంగా ఉందని బండి సంజయ్ పేర్కొన్నారు.

# ఫిజికల్ ఫినెస్‌తో ఆరోగ్యం ముఖ్యం

## రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్

**మహబూబ్‌నగర్, జనవరి 7 (సమ సమాజం):** మనిషి శారీరకంగా, మానసికంగా సామర్థ్యం కలిగి ఉండేందుకు ఫిజికల్ ఎడ్యుకేషన్ చాలా ముఖ్యమని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. పాలమూరు విశ్వవిద్యాలయంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో 2 రోజుల పాటు నిర్వహిస్తున్న ద ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్, ఫిట్‌నెస్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్- 2022 అంతర్జాతీయ సదస్సును మంత్రి శ్రీనివాస్ గౌడ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. అన్ని విషయాలతో పోలిస్తే ఫిజికల్ ఎడ్యుకేషన్ చాలా ముఖ్యమని, దీనివల్ల మనిషికి మానసిక ఎదుగుదలతో పాటు, శారీరక సామర్థ్యం, క్రమశిక్షణ అలవడతాయని అన్నారు. పాలమూరు విశ్వవిద్యాలయంలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం అంతర్జాతీయ సదస్సును ఇక్కడ నిర్వహించడం పట్ల యూనివర్సిటీ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్‌ను, సిబ్బందిని శ్రీనివాస్ గౌడ్ అభినందించారు. మనిషి శారీరకంగా మంచి సామర్థ్యం కలిగి ఉంటేనే మెంటల్‌గా కూడా బాగుం టాడని ,తద్వారా చదువుపై దృష్టి సారించడానికి అవకాశం ఉంటుందన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరు చదువుతో పాటు, ఫిజికల్ ఫిట్‌నెస్‌పై కూడా దృష్టి సారించాలన్నారు. పూర్వకాలంలో ఉదయం లేచినప్పటి నుండి పడుకునే వరకు మన జీవన శైలి శారీరక శ్రమతో కూడుకొని ఉండేదని గుర్తు చేశారు. ఇప్పుడు టెక్నాలజీ పెరిగిపోయిన తర్వాత యాంత్రిక జీవనంలో మనిషి శారీరక కార్యక్రమాలు తగ్గిపోయాయని పేర్కొన్నారు. జీవన విధానంలో మార్పు రావడం వలన మనుషులు అనేక రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. తిరిగి పురాతన సాంప్రదాయాలు, జీవన కార్యక్రమాలను పునరుజ్జీవింప చేయాల్సిన అవసరం ఉందని మంత్రి వెల్లడించారు.



# బిసిసిఐ సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా చేతన్ శర్మ

### మరోమారు అతడికే ఛాన్స్




**ముంబై, జనవరి 7 (సమ సమాజం):** భారత క్రికెట్ జట్టు సెలక్షన్ కమిటీని బీసీసీఐ ప్రకటించింది. సెలక్షన్ కమిటీ కొత్త చైర్మన్ గా మరోసారి చేతన్ శర్మ ఎంపికయ్యారు. సెలక్షన్ కమిటీ సభ్యులుగా శివ సుందర్ దాస్,సుబ్రోతో బెనర్జీ, సలీల్ అంకోలా, శ్రీధరన్ శరత్ లు అవకాశం దక్కించుకున్నారు. కాగా టీ20 ప్రపంచకప్-2022లో రోహిత్ శర్మ సారధ్యంలోని టీమిండియా దారుణ వైఫల్యం నేపథ్యంలో సెలక్షన్ కమిటీని బీసీసీఐ రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఖాళీ స్థానాల కోసం ధరఖాస్తలు అహ్వానించింది. నవంబరు 18న 5 పోస్టుల కోసం దరఖాస్తులు కోరగా.. మొత్తం 600 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 11 మందిని షార్ట్‌లిస్ట్ చేసి ఇంటర్వ్యూ చేసి, ఫైనల్ గా ఐదుగురిని ఎంపిక చేసింది. ఈ కమిటీకి చైర్మన్‌గా చేతన్ శర్మ ఉంటాడని బీసీసీఐ ప్రకటించింది. భారత జట్టు ఆడే ఆటగాళ్లను ఆ కమిటీ ఎంపిక చేస్తుంది.

# 8 ఏళ్ల తరవాత సెంచరీతో కదం

### అద్భుత ఫామ్ కనబర్చిన సర్ఫరాజ్

**లాహోర్, జనవరి 7 (సమ సమాజం):** పాకిస్తాన్, న్యూజిలాండ్ మధ్య జరిగిన టెస్ట్ సిరీస్‌లో పాక్ బ్యాట్స్‌మన్ సర్ఫరాజ్ అహ్మద్ అద్భుతంగా ఆడాడు. ఆడిన నాలుగు ఇన్నింగ్స్ లలో మూడు హాఫ్ సెంచరీలతో ఆకట్టుకున్నాడు. చివరి టెస్టులో ఏకంగా సెంచరీతో కదం తొక్కాడు. 77 పరుగులకే 4 కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న సమయంలో జట్టును ఆదుకున్నాడు. 176 బంతుల్లో 118 పరుగులు చేశాడు. 4 ఏళ్ల తర్వాత పాక్ జట్టులో చోటు దక్కించుకున్న సర్ఫరాజ్ 8 ఏళ్ల తర్వాత సెంచరీ సాధించడంపై అభిమానులు కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. సర్ఫరాజ్ సెంచరీ చేసిన సమయంలో అతని భార్య కన్నీటి పర్యంతమైంది.




# ఆడిలైడ్ టోర్నీకి దూరంగా ఇగ స్వియటెక్

### గాయంతో తప్పుకుంటున్నట్లు వెల్లడి



**సిడ్నీ, జనవరి 7 (సమ సమాజం):** ఆస్ట్రేలియాలో త్వరలో ప్రారంభం కానున్న అడిలైడ్ ఇంటర్నేషనల్ 2 టోర్నీకి స్టార్ ప్లేయర్ దూరం అయింది. మహిళల టెన్నిస్‌లో వరల్డ్ నంబర్ 1 ఇగ స్వియటెక్ ఈ టోర్నీనుంచి వైదొలిగింది. కుడి భుజానికి గాయం కావడంతో ఆమె ఈ నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని డబ్ల్యూటీఏ ట్విట్టర్ వేదికగా ప్రకటించింది. కుడి భుజం గాయం కారణంగా వరల్డ్ నంబర్ వన్ స్వియటెక్ అడిలైడ్ ఇంటర్నేషనల్ 2 టోర్నమెంట్ నుంచి తప్పుకుంది అని ట్విట్టర్ పోస్టులో రాసుకొచ్చింది. జనవరి 9న ఈ టోర్నీ ప్రారంభం కానుంది. అయితే.. ఇదే నెలలో ఆస్ట్రేలియన్ ఓపెన్ ఉంది. దాంతో, స్వియటెక్ ఆలోపు కోలుకుంటుందా? లేదా? అనే సందేహం అభిమానుల్లో ఉంది. పురుషుల వరల్డ్ నంబర్ 1 కార్లోస్ అల్కరాజ్ కూడా ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు దూరం కానున్నాడు. కాలికి గాయం కారణంగా అతను ఈ మెగా టోర్నీ నుంచి తప్పుకోనున్నాడు. ÷ఔదు సార్లు గ్రాండ్‌స్లామ్ విజేత అయిన ఆమె సిడ్నీలో శుక్రవారం జరిగిన యునైటెడ్ కప్ మిక్స్‌డ్ టీమ్స్ టోర్నమెంట్‌లో అనూహ్యంగా ఓడిపోయింది. అమెరికాకు చెందిన జెస్సీ పెగులా చేతిలో 2-6, 2-6తో పరాజయం చెందంది. అమెరికా జట్టు పోలాండ్‌పై 5-0తో విజయం సాధించ్గి ÷నైల్‌కు దూసుకెళ్లింది.




# టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన పాండ్యా

### తొలి ఓవర్‌లోనే ఇషాన్ కిషన్ క్యాచ్ ఔట్

### 16 బంతుల్లో 35 పరుగులు చేసి ఔటయిన త్రిపాఠీ

**రాజ్‌కోట్, జనవరి 7 (సమ సమాజం):** సిరీస్ డిసైడర్ అయిన మూడో టీ20లో టాస్ గెలిచిన భారత్ బ్యాటింగ్ ఎంచుకుంది.ఈ స్టేడియంలో ఇప్పటివరకు 4 టీ20లు జరిగాయి. రెండుసార్లు మాత్రమే మొదట బ్యాటింగ్ చేసిన జట్టు గెలిచింది. బౌలింగ్ ఎంచుకున్న జట్టు రెండు సార్లు విజేత అయింది. కొత్త ఏడాదిలో తొలి టీ20 సిరీస్ కావడంతో రెండు జట్లు గెలవాలనే పట్టుదలతో ఉన్నాయి. భారత్‌ను టాపార్డర్ వైఫల్యం కలవర పరుస్తోంది. రెండు మ్యాచుల్లో ఓపెనర్లు గిల్, ఇషాన్ పెద్దగా రాణించలేదు. రెండో టీ20లో 7 నో బాల్స్ వేయడంతో మ్యాచ్ చేజారింది. శ్రీలంక విషయానికి వస్తే.. ఓపెనర్లు కుశాల్ మెండిస్, కెప్టెన్ దసున్ షనక భీకరమైన ఫామ్‌లో ఉన్నారు. బౌలింగ్ కూడా బలంగా కనిపిస్తోంది. మొదటి టీ 20లో ఇండియా 2 పరుగులతో గెలిచింది. రెండో టీ20లోభారీ స్కోర్ ( 206 ) చేసిన శ్రీలకం 16 పరుగుల తేడాతో విజయం సాధించింది. భారత జట్టులో ఏ మార్పు లేదు. శ్రీలంక రాజపక్సే స్థానంలో అవిష్క ఫెర్నాండోను తీసుకుంది. ఇక బ్యాటింగ్ ప్రారంభించిన టీమిండియాలో దూకుడుగా ఆడే క్రమంలో రాహుల్ త్రిపాఠి (35)అవుట్ అయ్యాడు. కరుణరత్నే బౌలింగ్‌లో మధుషనక క్యాచ్ అందుకోవడంతో వెనుదిరిగాడు. ఓపెనర్ శుభ్‌మన్ గిల్‌తో కలిసి త్రిపాఠి పవర్ ప్లేలో దూకుడుగా ఆడాడు. దాంతో, 5 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 39 రన్స్ చేసింది. త్రిపాఠి 16 బంతుల్లోనే 35 పరుగులు చేశాడు. మహేష్ థీక్షణ వేసిన ఐదో ఓవర్‌లో మూడు ఫోర్లు బాదాడు. వేగంగా ఆడే క్రమంలో కరుణరత్నే వేసిన ఆరో ఓవర్‌లో సిక్సర్ బాది, ఆ తర్వాత షాట్‌కు ప్రయత్నించాడు. కానీ, మధుషనక మెరుపు క్యాచ్ అందుకున్నాడు. సూర్యకుమార్ యాదవ్ 14, గిల్ 23 పరుగులతో క్రీజులో ఉన్నారు. తొలి ఓవర్‌లోనే భారత్ ఓపెనర్ ఇషాన్ కిషన్ (1) వికెట్ కోల్పోయింది. మధు షనక బౌలింగ్‌లో కీపర్ ధనంజయ క్యాచ్ అందుకోవడంతో ఇషాన్ అవుట్ చేశాడు.


## చలన చిత్రం

# చంఘీజ్‌ఖాన్‌పై మనసు పారేసుకున్న బాలయ్య



నందమూరి నటసింహం బాలకృష్ణ నటించిన వీరసింహారెడ్డి ప్రీ రిలీజ్ ఈవెంట్ గ్రాండ్ సక్సెసైంది.

ఈ ప్రీరిలీజ్ వేదికపై బాలకృష్ణ తదుపరి నటించే ఓ మూడు సినిమాలపై చాలా వరకూ క్లారిటీ వచ్చేసింది. వీరసింహారెడ్డి రిలీజ్ కాగానే తదుపరి అనీల్ రావిపూడితో సినిమాని బాలయ్య అత్యంత వేగంగా పూర్తి చేస్తారు. అనీల్ రావిపూడి కూడా మరో మంగోలియన్.. నెక్స్ ఉంది! అంటూ బాలయ్య ఉత్సాహంగా ఈ వేదికపై వెల్లడించారు. అలాగే వేదిక వద్ద ఆదిత్య 369 కటౌట్ అంతే ఆసక్తికరంగా కనిపించింది. దీని ఉద్ధేశం కచ్చితంగా బాలకృష్ణ తదుపరి సినిమా ఆదిత్య 369 సీక్వెల్ (ఆదిత్య 999 మ్యాక్స్) అని అర్థమవుతోంది. ఈ సినిమాతో తనయుడు మోక్షజ్ఞను లాంచ్ చేసేందుకు ఆయన ఉరకలెత్తుతున్నారు. అందుకే ఈ ప్రత్యేక కటౌట్ ఒంగోలు వెన్యూ వద్ద హైలైట్ అయ్యిందని అభిమానుల్లో చర్చ కొనసాగింది. ఛంఘీజ్ ఖాన్ సినిమా చేస్తా.. నా జీవితాశయం!.. కానీ టైమ్ రావాలి..అంటూ బాలయ్య బాబు వేదికపైతన లక్ష్యాన్ని చెప్పారు. ఈ వేదికపై బాలయ్య స్పీచ్ మధ్యలో ఒంగోలియన్ మంగోలియన్ అని స్మరిస్తూనే అనీల్ రావిపూడి పేరును ప్రస్థావించడం కొత్త డౌట్ పెట్టేసింది. ఒకవేళ ఛంఘీజ్ ఖాన్ కథాంశాన్ని అనీల్ రావిపూడి హ్యాండిల్ చేస్తున్నారా? లేక అతడు ఎంపిక చేసుకున్న కథాంశం ఎఫ్ 3 - పటాస్ తరహానా అన్నది తనే స్వయంగా వెల్లడించాల్సి ఉంది. బాలయ్య బాబు ఎగ్జయిట్ మెంట్ ఉత్సాహాన్ని చూశాక ఇవన్నీ కేవలం ఊహాగానాలు మాత్రమే. మంగోలియనే అంటూ అనీల్ రావిపూడిపైనా బాలయ్య కామెంట్ చేయడం చూస్తుంటే ఛంఘీజ్ ఖాన్ స్క్రిప్టుపైనా అతడు వర్కవుట్ చేస్తున్నారా? అన్న సందేహం రేకెత్తింది. బాలయ్యలో ఉప్పొంగిన ఉత్సాహం .. వేదిక ఆద్యంతం ఉద్విగ్నమైన స్పీచ్.. 60 ప్లస్ లోనూ ఆ జోరు ఆశ్చర్యపరిచింది. చాలా జానర్లు చేసాను. ఇంకా కాక తీరలే! అంటూ బాలకృష్ణ జోష్ చూపించడంతో మాస్ గాడ్ నుంచి మరిన్ని విలక్షణ సినిమాలను ఆశించవచ్చని అభిమానులు భావిస్తున్నారు.




# మరో ప్రతిష్టాతక అవార్డు వేటలో ఆర్ఆర్ఆర్

### బ్రాట్ నాన్ ఇంగ్లీష్ అవార్డుల కేటగిరీలో చోటు

ఆర్ఆర్ఆర్ అదరగొడుతూ..అవార్డుల వేటలో దూసుకెళ్తోంది. ఇప్పటికే పలు అంతర్జాతీయ అవార్డులకు షార్ట్‌లిస్టు అయిన ఆర్ఆర్ఆర్ ఫిల్మ్.. ఇప్పుడు మరో ప్రతిష్టాతక అవార్డు కోసం కుస్తీపడుతోంది. రాజమౌళి దర్శకత్వంలో రిలీజైన ఈ ఫిల్మ్.. తాజాగా బ్రాట్ ( బ్రిటీష్ అకాడమీ ఆఫ్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఆర్ట్స్) నాన్ ఇంగ్లీష్ కేటగిరీలో బెస్ట్ ఫిల్మ్ అవార్డు కోసం లాంగ్‌లిస్ట్‌లో చేరింది. ఆర్ఆర్ఆర్ నిర్మాతలు ఈ విషయాన్ని తమ ట్విట్టర్‌లో తెలిపారు. బ్రాటా లాంగ్‌లిస్టులో ఆర్ఆర్ఆర్‌కు చోటు దక్కడం సంతోషకరమని, ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు అని ఆ చిత్ర నిర్మాతలు తమ ఇన్‌స్టాగ్రామ్‌లో వెల్లడించారు. బాఎ÷-టాలో తొలుత లాంగ్ లిస్టును ప్రకటిస్తారు. ఆ తర్వాత నామినేషన్లను, ఆ తర్వాత ఓవరాల్ విన్నర్‌ను వెల్లడిస్తారు. అయితే బాఎ÷-టా నామినేషన్లను జనవరి 19వ తేదీన ప్రకటించనున్నారు. ఇక అవార్డులను ఫిబ్రవరి 19వ తేదీన ప్రకటిస్తారు. బాఎ÷-టా నాన్ ఇంగ్లీష్ లాంగ్‌లిస్ట్ కేటగిరీలో ఆర్ఆర్ఆర్‌తో పాటు ఆల్ క్వయిట్ ఆన్ ద వెస్ట్రన్ ఫ్రంట్, అ÷-జర్గ÷ంటీనా, 1985, బార్డో, ఫాల్స్ క్రానికల్ ఆఫ్ ఎ హ్యాండ్‌ఫుల్ ఆఫ్ ట్రుత్స్, క్లోజ్, కోర్సేజ్, డిసిజన్ టు లీవ్, ఈవో, హోలీ స్పైడర్, ద క్వయిట్ గర్ల్ పోటీపడుతున్నాయి. బాఎ÷-టా లాంగ్ లిస్టుకు 10 చిత్రాలను ఎంపిక చేశారు. దీంట్లో చివరకు 5 సినిమాలను అవార్డుకు నామినేట్ చేస్తారు. ఆ తర్వాత విన్నర్‌ను ప్రకటిస్తారు. రామ్ చరణ్, జూనియర్ ఎన్టీఆర్ నటించిన ఆర్ఆర్ఆర్ ప్రపంచ వ్యాప్తంగా కోట్లు వసూలు చేసింది. గో÷-డలెన్ గ్లోబ్‌తో పాటు ఆస్కార్స్ రేసులోనూ ఈ ఫిల్మ్ పోటీపడుతోంది. జనవరి 11వ తేదీన లాస్ ఏంజిల్స్‌లో జరగనున్న గోల్డెన్ గ్లోబ్ అవార్డుల ప్రదానోత్సవానికి రామ్, ఎన్టీఆర్ హాజరుకానున్నారు. గోల్డెన్ గ్లోబ్‌లో బెస్ట్ ఫారిన్ ఫిల్మ్‌తో పాటు నాటు నాటు సాంగ్‌కు మ్యూజిక్ క్యాటగిరీలో పోటీపడుతోంది. ఇక ఆస్కార్స్‌లో నాటు నాటు సాంగ్ రేసులో ఉంది. బెస్ట్ ఒరిజినల్ సాంగ్ కేటగిరీ షార్ట్‌లిస్టులో ఆర్ఆర్ఆర్ పోటీపడుతున్న విషయం తెలిసిందే.

# వరుసగా రెండు సినిమాలతో

### సంక్రాంతికి శృతిహాసన్ రచ్చ

శృతిహాసన్ హీరోయిన్‌గా వరుసగా సినిమాలు చేస్తూ వస్తోంది. తాజాగా ఈ అమ్మడు నటించిన రెండు పెద్ద సినిమాలు ఈ సంక్రాంతికి విడుదల కాబోతున్నాయి. అవే వాల్తేరు వీరయ్య మరియు వీర సింహారెడ్డి. ఈ రెండు సినిమాలు కూడా ఒక్క రోజు తేడాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. నందమూరి బాలకృష్ణ మరియు చిరంజీవికి జోడీగా ఒకసారి నటించడం.. అది కూడా ఒక్క రోజు తేడాతో సంక్రాంతి కానుకగా శృతి హాసన్ సినిమాలు వస్తున్న నేపథ్యంలో అంతా కూడా ఆసక్తిగా ఆమె వైపు చూస్తున్నారు. రెండు సినిమాల్లో కూడా ఆమె పాత్ర గురించి ఆసక్తికరంగా చర్చ జరుగుతోంది. శృతి హాసన్ ఇప్పటికే నటిగా మరియు డాన్సర్ గా తన ప్రతిభను గత చిత్రాలతో చూపించింది. ఈ సారి మాత్రం తనలోని కొత్త యాంగిల్ ను ఈ అమ్మడు చూపించబోతున్నట్లుగా ఆయా చిత్ర యూనిట్ సభ్యులు చెబుతున్నారు. వాల్తేరు వీరయ్య సినిమాలో ఈ అమ్మడి కామెడీ టైమింగ్ అదిరి పోతుందట. అంతే కాకుండా వీరసింహారెడ్డి సినిమాలో కూడా శృతి హాసన్ కామెడీ సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా ఉంటాయి అంటున్నారు.



Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in